క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్ : విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు(ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా కేంద్రంలో ములుగు ఫీడర్-1 పరిధి కృష్ణాకాలనీ, శ్రీనివాస కాలనీ, ప్రగతి కాలనీ, సాధన స్కూల్ ప్రేమ్‌నగర్, పత్తిపల్లి మిల్లులు, వీవర్స్ కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ 11కేవీ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



వాజేడు : మండల పరిధిలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది శనివారం అనుమానితులకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వ్యాధి లక్షణాలు ఉన్న 15మంది నుంచి తెమడను సేకరించారు. హెచ్ఈఓ వేణుగోపాలకృష్ణ, రవి, శ్రీదేవి, శారద తదితరులు ఉన్నారు.

మిర్చి తోటల పరిశీలన



సాక్షి స్పందన

వెంకటాపురం(కె) : మండలంలోని గోదావరి వరద ముంపునకు గురైన మిర్చి తోటలను ఉద్యాన అధికారి లావణ్య శనివారం పరిశీలించారు. 'మిర్చి రైతుల కష్టాలు' అని 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మండలంలో నష్టపోయిన మిర్చి తోటల రైతుల వివరాలను సేకరించారు. అనంతరం మిర్చితోటలను కాపాడుకునేందుకు రైతులకు పలు సూచనలు చేశారు.

పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక



చిట్యాల : మండలంలోని కైలాపూర్ గ్రామంలో పద్మశాలి సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతల పెద్ద నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా చింతల చిన్న సదానందం, కోశాధికారిగా చింత రజనీకాంత్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముదిగొండ నాగరాజు, చింతల రాజమౌళి, పెద్ద వీరయ్య, సుమన్, మహేందర్, రాజేందర్, బుద్దారపు రవీందర్, పాశీగంటి మహేందర్, భిక్షపతి, మార్కండేయ, తిరుపతి, సాంబయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కాటారం: బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధిగా జక్కు శ్రావణ్‌కుమార్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా మానెం రాజబాబు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ యూత్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్ శనివారం మండల కేంద్రంలో నియామక పత్రాలు అందజేశారు. తమ నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో పాటు నాయకులకు శ్రావణ్, రాజబాబు కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ



టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బిల్లకంటి ఉమేందర్ రావు తల్లి సుగుణమ్మ, రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన బందెల సమ్మక్క శనివారం మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు.

బురదమయంగా రోడ్డు



మల్హర్: మండలంలోని వల్లెకుంట ఊర చెరువు కట్ట రోడ్డు బురదమయంగా మారింది. వర్షాలకు చెరువు కట్ట రోడ్డు పూర్తిగా బురదగా మారి నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో వ్యవసాయ పనుల నిమిత్తం చెరువు కట్ట మీదగా పొలాల వైపునకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వాట్సాప్‌లో 'వ్యవసాయం'

అన్నదాతల కోసం ప్రత్యేక ఛానల్ ప్రారంభం

- రైతుకు చేరువగా వ్యవసాయ అధికారులు
- గ్రూప్‌లో అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు
- సులువుగా సమస్యల పరిష్కారం



వరిపైరు



వాట్సాప్ ఛానల్‌లో వ్యవసాయ సమాచారం

గోవిందరావుపేట : అధునాతన సాంకేతికత అభివృద్ధితో రైతులకు వ్యవసాయ సమాచారం సులువుగా అందుతోంది. శాస్త్రవేత్తల సూచనలతో సమస్యలు పరిష్కరించుకోనేందుకు అవకాశం ఏర్పడింది.. మండలంలోని రైతులు సాగుచేసిన పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ సాంకేతిక పరిజ్ఞానంతో వాట్సాప్ ఛానల్‌ను ప్రారంభించింది. సుమారుగా 20వేల ఎకరాలకు పైగా అన్నదాతలు వరిసాగు చేస్తున్నారు. పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులకు ఈ వాట్సాప్ గ్రూప్ చాలా ఉపయోగపడుతుంది. కావాల్సిన సమాచారాన్ని క్షణాల్లో రైతులకు చేరవేస్తూ వ్యవసాయ శాఖ సైతం టెక్నాలజీని వినియోగించుకుంటోంది. ప్రభుత్వ పథకాలు, వాతావరణ సూచనలు, సాగు పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు తదితర వ్యవసాయ సమాచారాన్ని రైతులకు అందించేందుకు ప్రత్యేకంగా వాట్సాప్ ఛానల్‌ను ఇటీవల అందుబాటులోకి తెచ్చింది. సాగులో ఎదురయ్యే సమస్యలు, సీజన్ల వారీగా పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, వాతావరణ సూచనలు తదితర సమాచారాన్ని రైతులు ఎప్పటికప్పుడు వాట్సాప్ చానల్ ద్వారా తెలుసుకోవచ్చు.

తెలుగులో రైతులకు సమాచారం

వ్యవసాయ శాఖ ప్రారంభించిన వాట్సాప్ ఛానల్‌లో తొలి విడతల్లో అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక ప్రతిభావంతులను చేర్చారు. తాజాగా ఆ గ్రూప్‌లో రైతులను చేర్చాలని ఆదేశాలు రావడంతో ఆసక్తి ఉన్న రైతులను నమోదు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి రైతు వాట్సాప్ ఛానల్‌లో చేరే వీలుంది. విత్తన దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు పంటల సమాచారం రైతులకు సులువుగా చేరుతుంది. తెలుగులో సమాచారం ఉండడంతో కొద్దిగా చదివే పరిజ్ఞానం ఉన్నా సరిపోతుంది. అలాగే వ్యవసాయ శాఖ అధికారిక సమాచారం సైతం అందుబాటులో ఉంటుంది. తెగుళ్లను ఫొటోలతో సహా తెలియజేయడంతో పాటు వాటి లక్షణాలు, నివారణకు పురుగుల మందులు తదితర వాటిని సూచిస్తున్నారు. జిల్లాలో ఆసక్తి గల రైతులు వాట్సాప్ ఛానల్‌లో చేరాలనుకుంటే సంబంధిత ఏఈఓ లు లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

ఒక్క క్లిక్‌తో సలహాలు,సూచనలు

వ్యవసాయ శాఖ ప్రత్యేక వాట్సాప్ ఛానల్ ద్వారా రైతులు కేవలం ఒక క్లిక్‌తో నేరుగా శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలు పొందగలరు. పంటల రోగ నిరోధకత, ఎరువుల సరైన వినియోగం, నీటి నిర్వహణ, విత్తనాల ఎంపిక వంటి వ్యవసాయ సాంకేతిక సలహాలు ఒక్క క్లిక్‌తోనే రైతు చేతిలోకి చేరుతాయి. తమ సమస్యలను ఫొటో లేదా మెసేజ్ రూపంలో షేర్ చేస్తే, నిపుణులు వెంటనే సమాధానం అందిస్తారు. ఈ ఛానల్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మంది రైతులకు ఒకేసారి ఉపయోగపడే డిజిటల్ వ్యవసాయ విజ్ఞానం అందించే మార్గం.

సమస్యలపై తక్షణ పరిష్కారం..



రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని నేరుగా అందించడం వ్యవసాయ శాఖ ప్రధాన ధ్యేయం. ఇప్పటికే రైతులు సమాచార లోపం వల్ల పంటల్లో నష్టపోతున్నారు. ఈ ప్రత్యేక వాట్సాప్ ఛానల్ ద్వారా రైతులు ఒక క్లిక్‌తోనే శాస్త్రవేత్తలు, నిపుణుల సలహాలు పొందే అవకాశం ఉంది. సమస్యలపై తక్షణ పరిష్కారం అందించడం ద్వారా రైతుల ఉత్పత్తి పెరుగుతుంది. సయమం,ఖర్చు కూడా తగ్గుతుంది. డిజిటల్ వేదిక ద్వారా రైతులు సమర్థవంతమైన వ్యవసాయం దిశగా ముందడుగు పడుతుంది.

- జితేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయాలి

- తహసీల్దార్‌కు ఆదివాసీ సంఘాల వినతి



తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

మంగపేట : షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఇచ్చిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి గిరిజనులకు అన్ని స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ మన్య సీమ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య ఆధ్వర్యంలో ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ భద్రు నాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ (షెడ్యూల్డ్ ప్రాంతం) చట్టం ప్రకారం ఆర్టికల్ నంబర్ 243 (టీ) ప్రకారం నాన్ షెడ్యూల్ ఏరియాలో జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలో ఆర్టికల్ నంబర్ 243 జడ్‌సీ, 244వ ఆర్టికల్ కింద క్లాస్ 01లో పేర్కొన్న షెడ్యూల్డ్ ప్రాంతాలకు, క్లాస్ 02లో పేర్కొన్న ఆదివాసీ ప్రాంతాలకు వర్తించదని తెలిపారు. తెలంగాణ ట్రైబల్ ఏరియా రెగ్యులైజేషన్ 1359 ఫస్లీ ప్రకారం ట్రైబల్ ఏరియాల్లో గిరిజనేతరుల భూమికి పట్టాలు, నివాసం ఉండటం నిషేధం ఉందని వివరించారు. అదే షెడ్యూల్డ్ ప్రాంతంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జనరల్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధంగా తాము భావిస్తున్నామని చెప్పారు. తక్షణమే షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజన చట్టాలను విస్మరించి ఇచ్చిన ఎన్నిక నోటిఫికేషన్ రద్దు చేసి గిరిజన ప్రాంత పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ చట్టం 1996, 1998 ప్రకారం గిరిజనులకు రిజర్వు చేస్తు రీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/59 ప్రకారం గిరిజనేతర వలసలు విరుద్ధమైనప్పుడు ప్రజా ప్రతినిధులుగా గిరిజనేతరులకు రిజర్వు చేయడం రాజ్యాంగ విరుద్ధమే అవుతుందని వారు ఆరోపించారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని గిరిజనులకు న్యాయం జరిగే విధంగా ఆదివాసీ చట్టాలను అమలు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో గిరిజన గూడాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించి న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు గొప్ప సమ్మారావు, మద్దెల అంజయ్య, కొండ చెంచయ్య, ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు తాటి నాగరాజు, అన్నెబోయిన సమ్మయ్య, నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, తోలెం నర్సింహారావు, పాదెం నాగేష్, తోలెం సుధాకర్, కుర్సం రమేష్, ఎట్టి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎంపీపీ పోరు



కొత్తపల్లిగోరి మండల పరిషత్ కార్యాలయం

రేగొండ : నూతన మండలంగా ఏర్పడ్డ కొత్తపల్లిగోరి మండలానికి ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులు బీసీ మహిళకు కేటాయిస్తూ శనివారం అధికారులు రిజర్వేషన్లు ప్రకటించారు. దీంతో నూతన మండలం మొట్టమొదటి పదవుల కోసం బీసీల్లోని పలువురు ప్రముఖులు ఇప్పటి నుంచే రంగంలోకి దిగేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు మండలంలోని నాయకులను, ప్రజలను మచ్చిక చేసుకుంటున్నారు. నూతన మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కొత్తపల్లిగోరి బీసీ జనరల్, జగ్గయ్యపేట జనరల్, దామరంచపల్లి జనరల్ మహిళ, చిన్నకోడేపాక ఎస్సీ జనరల్, సుల్తాన్‌పూర్ బీసీ జనరల్, నిజాంపల్లి బీసీ మహిళకు కేటాయించారు. చిన్నకోడెపాక తప్ప మిగతా ఐదు ఎంపీటీసీ స్థానాలు ఎంపీపీ పదవికి అర్హులే. దీంతో పోరు రసవత్తరంగా మారనుంది. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీలకు చెందిన నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పలువురు నాయకులు నూతన మండలంలో మొట్టమొదటి సారిగా పదవిని దక్కించుకోవాలని ఆశపడ్డ, తమకు అనుకూలంగా రిజర్వేషన్ రాకపోవడంతో నిరాశలో మునిగిపోయారు.

కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు రావు



కాంగ్రెస్ గ్యారంటీ బాకీ కార్డులను చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగజ్యోతి

గోవిందరావుపేట : కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్లు రావని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహనాయక్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా బడే నాగజ్యోతి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు మోసపూరితమైనవని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై ఎండగట్టాలన్నారు. ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు నాయకులంతా ఐక్యంగా కృషి చేస్తేనే విజయం సాధ్యమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన గ్యారంటీ బాకీ కార్డులను కార్యకర్తలకు అందించినట్లు తెలిపారు. వీటిని ప్రజలకు చూపిస్తూ కాంగ్రెస్ పార్టీ అమలు చేయని హామీలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పోరిక గోవింద్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, స్వరూప, జ్యోతి, శ్రీనివాసరావు, రాంచందర్, చందూలాల్, రవీందర్ రెడ్డి, రాణి, విజయ, హనుమంతరావు, పూర్ణచందర్, రమేష్, శ్రీనివాసచారి, కేదారి, సురేష్, వెంకన్న, గట్టయ్య, మధు, చందర్ రాజు, సంజీవ తదితర నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

టేకుమట్ల : మండలంలోని గర్మిళ్లపల్లి శివారులో గురువారం ఉదయం మానేరు దాటుతూ వరద ప్రవాహంలో గల్లంతైన చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం తండాకు చెందిన అజ్మీరా రాజేందర్ మృతదేహం కాల్వపల్లి శివారులోని మానేరులో గుర్తించారు. శనివారం ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వాజేడు: అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు



వాజేడు: శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు



వెంకటాపురం(కె): ఊరేగింపులో భక్తులు



వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



మంగపేట మండల కేంద్రంలో అమ్మవారి ఊరేగింపులో కోలాటమాడుతున్న మహిళలు

మంగపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారి శోభాయాత్ర(ఊరేగింపు) కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో మండలంలోని మంగపేట, కమలాపురం, బోరునర్సాపురం, తిమ్మంపేట, మల్లూరు, నర్సింహాసాగర్, రమణక్కపేట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను మంగళ వాయిద్యాలు, డీజే సౌండ్స్‌తో ఊరేగించి గోదావరిలో నిమజ్జనం చేశారు. మహిళల కోలాట ప్రదర్శనలు, యువకులు కేరింతలతో నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఊరేగిపు అనంతరం నిర్వాహకులు అమ్మవారి ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేశారు. అలాగే మండలంలోని కమలాపురం రామాలయంలో దుర్గాదేవి అమ్మవారి వద్ద లడ్డూ ప్రసాదం వేలం వేయగా వరంగల్‌కు చెంది కల్వకుంట్ల విక్రమ్‌రావు రూ.42వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

వెంకటాపురం(ఎం) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత నిమజ్జన వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తులచే విశేష పూజలందుకున్న అమ్మవారిని భక్తుల భజనలు, నృత్యాల మధ్య గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామప్ప చెరువులో దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దుర్గామాత విగ్రహాల ఊరేగింపు

వెంకటాపురం(కె) : మండలంలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. శనివారం మండల కేంద్రంలోని శివాలయం, రజక బజార్‌లో, పాత మార్కెట్ సెంటర్, వేప చెట్టు సెంటర్, పెరిక వీధిలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం పాత్రాపురం పంచాయతీ పరిధిలోని పాలెం వాగులో నిమజ్జనం చేశారు.

వాజేడు : శరన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను శనివారం ఊరేగించి పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరిలో నిమజ్జనం చేశారు.



మంగపేట: తిమ్మంపేటలో..



మంగపేట మండల కేంద్రంలో..



మంగపేట: కమలాపురంలో మహిళల కోలాటం



ఏటూరునాగారం: నృత్యాలు చేస్తున్న భక్తులు



వెంకటాపురం(ఎం): అమ్మవారి ఊరేగింపు...



మంగపేటలో నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

హామీలను విస్మరించిన ప్రభుత్వం



రేగొండ: బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేసిన మోసాలపై బీఆర్ఎస్ తీసుకొచ్చిన కాంగ్రెస్ బాకీ కార్డులను శనివారం మండలంలోని రూపిరెడ్డిపల్లి, దమ్మన్నపేట, కనిపర్తి, నాగుర్లపల్లి గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుతూ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, నాయకులు మహేందర్, భద్రయ్య, రాజు, అర్జున్, జనార్ధన్, సమ్మయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

భూపాలపల్లి రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి భూపాలపల్లి మండలంలోని గొర్లవీడులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరిట 420 హామీలు ఇచ్చి మరిచిపోయిందని ఆరోపించారు. హామీలను నెరవేర్చకుండా మాయ చేస్తున్న ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో ఇప్పటి వరకు ఒక్కో వ్యక్తికి ఎంత బాకీ పడిందో తెలియచేస్తూ గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి బాకీ కార్డు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



టేకుమట్ల: ఆర్థిక సాయం చేస్తున్న గ్రామస్తులు



కాళేశ్వరం: నగదు అందజేస్తున్న సురేశ్

టేకుమట్ల : మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాద ఓదెలు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి గ్రామస్తులు శనివారం రూ.1,05,117లను ఆర్థిక సాయంగా అందజేసి భరోసా కల్పించారు. తోట గట్టయ్య, పోతనవేని ఐలయ్య, తోట సాగర్, కూచన రవీందర్, పుట్ట నరేష్, అంతనగిరి నరేష్, ముత్యాల రవీందర్, పెద్దోజు రమణాచారి, దానవేని ఐలయ్య, బండి కొమురయ్య, సాద రఘు, రమేశ్, సాద మధునయ్య, సుధాకర్, కార్తీక్, శ్రీను, దానవేని ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మండలంలోని కాళేశ్వరంలో సయ్యద్ బలీమ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని హరిత హోటల్ మేనేజర్ జక్కం సురేశ్ సిబ్బందితో కలిసి పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం అందించాడు.

ఉపాధ్యాయులకు సన్మానం



భూపాలపల్లి అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికైన వారికి శనివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సన్మాన చేశారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులు, సీఆర్‌పీలకు ఎంఈఓ దేవానాయక్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. సమాజంలో వ్యక్తులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పలు పాఠశాలల కాంప్లెక్స్ ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, అనిత, పద్మావతి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.